క్లుప్తంగా

నేడు చాగల్లులో సామాజిక తనిఖీ ప్రజావేదిక

చాగల్లు: ఉపాధి హామీ పథకం మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదికను గురువారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ బి.రాంప్రసాద్ తెలిపారు. చాగల్లులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గతేడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఈ ఏడాది మార్చి నెలాఖరు వరకూ నిర్వహించిన ఉపాధి పనులపై 16వ సామాజిక తనిఖీ బృందం ఆయా గ్రామాల్లో ఇప్పటికే విచారణ పూర్తి చేసిందన్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి సెప్టెంబర్ నెలాఖరు వరకూ జరిగిన పనులపై కూడా విచారణ జరిపినట్టు ఆయన వివరించారు. ఈ తనిఖీల్లో గుర్తించిన అంశాలపై గురువారం ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో ప్రజావేదిక నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

ఆయుర్వేద ఆసుపత్రికి ఫర్నిచర్ అందజేత



ఫర్నిచర్ అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేత ఆత్కూరి దొరయ్య

నిడదవోలు: రోటరీ సభ్యులు చేపడుతున్న సామాజిక సేవలు అభినందనీయమని రైస్ మిలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య అన్నారు. రోటరీ క్లబ్ అఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో నిడదవోలులోని ఆయుర్వేద ఆసుపత్రికి అవసరమైన ఫర్నిచర్‌ను గురువారం ఆయన చేతుల మీదుగా విరాళంగా అందజేశారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పోలదాసు శ్రీనివాస్, ఆడిటర్ పచ్చిపులుసు శ్రీరామారావు ఆర్థిక సహకారం అందించారు. క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, కార్యదర్శి గుంటుపల్లి శివకుమార్, కోశాధికారి కాళ్ళ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ డీఎం

నిడదవోలు: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడానికి వీలుగా ఈనెల 10వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆర్టీసీ నిడదవోలు డిపో మేనేజర్ శ్రీరామ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఆర్టీసీ ప్రయాణానికి సంబంధించిన సందేహాలు, సూచనలు, అభిప్రాయాలను 91009 54632, 73829 05797 అనే సెల్ నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

వెండి నాగ సర్పం సమర్పణ



వెండి నాగ సర్పం

చాగల్లు: స్థానిక శ్రీ వల్లీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి చాగల్లుకే చెందిన దాతలు వెండి వస్తువులు సమర్పించారు. వెత్సా వాసు దంపతులు వల్లీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయడానికి బుధవారం వెండి నాగ సర్పాన్ని ఆలయ కమిటీకి సమర్పించారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

తాళ్లపూడి: రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల శాఖ అధ్యక్షుడు ఎస్.నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. తాళ్లపూడి మండల రిటైర్డ్ ఎంప్లాయిస్ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ డీఏ ఎరియర్స్ విడుదల చేయాలని, ప్రతి నెలా ఒకటో తేదీనే పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. సుమారు 50 మంది రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు. కోశాధికారి వి.చంద్రయ్య, గౌరవాధ్యక్షుడు ఎస్. కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

20 లీటర్ల సారాతో ఒకరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న సారా, అరెస్టు చేసిన నిందితుడితో పోలీసులు

తాళ్లపూడి: మండలంలోని తుపాకులగూడెం గ్రామంలో సారా తయారు చేసి, విక్రయిస్తున్న శీలబోయిన వీరభద్ర నాగభూషణం అనే వ్యక్తిని బుధవారం తాళ్లపూడి పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే అతడి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. నిందితుడ్ని రిమాండ్‌కు పంపినట్టు తాళ్లపూడి ఎస్సై కె.వెంకటరమణ తెలిపారు.

మద్యం బాటిళ్లతో మహిళ అరెస్టు

కొవ్వూరు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కేసులో తాళ్లపూడి మండలం పైడిమెట్టకు చెందిన మహిళను ఎస్సై జి.బసంతి బుధవారం అరెస్ట్ చేసినట్టు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీటీవీ సత్యనారాయణ తెలిపారు. నిందుతురాలి వద్ద ఎనిమిది మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నదానం



దేవరపల్లిలోని అయ్యప్ప స్వామి ఆలయం

- దేవరపల్లిలో 26 ఏళ్లుగా భక్తుల సేవలో..
- రోజూ 350 మంది స్వాములకు అన్న ప్రసాదం
- సహకరిస్తున్న దాతలు



దేవరపల్లి అయ్యప్ప స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న అన్నదానం

దేవరపల్లి: స్థానిక అయ్యప్ప స్వామి ఆలయం వద్ద అయ్యప్ప మాలధారణ చేసిన స్వాములకు అన్నదానం చేస్తున్నారు. మండల పరిసర గ్రామాల్లోని సుమారు 350 నుంచి 400 మంది భక్తులకు రోజూ అన్నదానం చేస్తున్నారు. గత నెల 18న ప్రారంభించిన ఈ అన్నదాన కార్యక్రమం డిసెంబర్ ఆరో తేదీ వరకూ కొనసాగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అయ్యప్ప, భవానీ మాలధారణ చేసిన స్వాములకు ఉచితంగా ఉదయం వడి (టిఫిన్), మధ్యాహ్నం భోజనం (భిక్ష) ఏర్పాటు చేస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాల స్వాములకే కాకుండా ఇతర జిల్లాల నుంచి కాలి నడకన వెళుతున్న స్వాములకు, భవానీలకు కూడా అన్నదానం చేస్తున్నారు. ఈ అన్నదానం వల్ల ఈ ప్రాంతంలో మాలధారణ చేసే స్వాముల సంఖ్య ఏటా పెరుగుతోంది. గత 26 సంవత్సరాలుగా ఆలయం వద్ద దాతల సహకారంతో ఉచిత అన్నదాన పథకాన్ని అమలు చేస్తున్నారు. ఏటా దసరా నుంచి 55 రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. అయ్యప్ప మాలధారణ చేసిన స్వాములు నియమ నిబంధనలు పాటిస్తూ అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్నారు. అన్నదాన పథకానికి దాతలు సహకరిస్తున్నారు. జనవరి 15న ఆలయ ప్రాంగణంలో కర్పూర జ్యోతి దర్శనం కల్పిస్తున్నారు.

15న పడిపూజ మహోత్సవం

ఈ నెల 15న ఆలయం వద్ద అయ్యప్ప స్వామివారి ఊరేగింపు, రాత్రి ఏడు గంటలకు పడిపూజ మహోత్సవం జరుగుతుంది. ఈ నెల 22వ తేదీ ఉదయం గణపతి హోమం, సాయంత్రం కలశపూజ మహోత్సవం జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అన్నదాన పథకానికి ఆదరణ



అన్నదాన పథకానికి దాతల ఆదరణ బాగుంది. రోజు 350 మందికి అన్నదానం చేస్తున్నాం. 55 రోజుల కార్యక్రమం నిర్విరామంగా జరుగుతోంది. ఆలయం నిర్మాణం చేసి 35 సంవత్సరాలైంది. 26 ఏళ్లుగా అన్నదానం నిర్వహిస్తూ అయ్యప్ప మాలధారణ చేసిన స్వాములకు ఉచితంగా వడి, భిక్ష ఏర్పాటు చేస్తున్నాం. కాకర్ల వీర్రాజు ట్రస్ట్ ద్వారా కాకర్ల వెంకటేశ్వరరావు సహకారంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– పొన్నాడ వెంకటరమణ, గురుస్వామి, దేవరపల్లి

సచివాలయ వ్యవస్థతో అర్హులకు మేలు

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- పురుషోత్తపల్లిలో సచివాలయ, ఆర్‌బీకే భవనాల ప్రారంభం



పురుషోత్తపల్లిలో సచివాలయ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సచివాలయ వ్యవస్థతో గ్రామాల్లో అర్హులకు లబ్ధి చేకూరుతోందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. మండలంలోని పురుషోత్తపల్లిలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.21.80 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలు, ప్రాంతీయ భేదాలు లేకుండా వలంటీర్లు సంక్షేమ పథకాలను ప్రజల ఇంటి వద్దకే అందిస్తున్నారన్నారు. పారదర్శక పాలన అందించేందుకు పల్లెల్లో సచివాలయం, రైతుభరోసా, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు నిర్మించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నేలపూడి నాగమణి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, సొసైటీ అధ్యక్షుడు సుంకవల్లి శ్రీహరి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు ముళ్లపూడి శ్రీనివాస చౌదరి, ముళ్లపూడి సుబ్బారావు, దుగ్గిన విష్ణు, ఎంపీడీవో పి.శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

సురక్ష శిబిరాలతో పేదలకు మేలు



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ

గోపాలపురం: ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని వేళ్లచింతలగూడెం సచివాలయం వద్ద బుధవారం నిర్వహించిన సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో 120 మందికి వైద్యులు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వారిలో 12 మందిలో ఎముకలు, గుండె సంబంధిత వ్యాధులను గుర్తించి ఉన్నత వైద్యం కోసం రాజమహేంద్రవరం ఆసుపత్రులకు సిఫార్సు చేసినట్టు డాక్టర్ కె. శ్రీనివాస్ తెలిపారు. శిబిరంలో జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, సర్పంచ్ గొల్ల కుమార్, ఎంపీటీసీ సభ్యుడు సనమండ్ర రాజయ్య, మండల సచివాలయాల కన్వీనర్ తానింకి సత్యనారాయణ, గెల్లా వెంకట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలన జగనన్నకే సాధ్యం

దొమ్మేరులో మంత్రి వనిత, కాట కోటేశ్వరంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు గడప గడపకూ..



కొవ్వూరు మండలం దొమ్మేరులో రాజస్తానీ కుటుంబంతో హోం మంత్రి తానేటి వనిత తదితరులు



కాట కోటేశ్వరంలో మహిళకు సంక్షేమ పథకాలు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

కొవ్వూరు: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకూ మేలు చేకూర్చేలా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, సుపరిపాలన అందించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని దొమ్మేరు-1 సచివాలయం పరిధిలోని దొమ్మేరు గ్రామంలో బుధవారం ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి మంత్రి వనిత ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి వెంట ఉన్న అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూర్చిన లబ్ధిని లెక్కలతో సహా వివరించారు. ప్రతి కుటుంబానికి ఏదో ఒక రూపంలో లబ్ధి చేకూరుస్తున్న జగన్ మోహన్‌రెడ్డికి మరోసారి ఓటేసి ఆశీర్వదించాలని మంత్రి కోరారు. ఉపాధి కోసం రాజస్తాన్ నుంచి వచ్చి కొన్నేళ్లుగా దొమ్మేరులో ఉంటున్న కుటుంబాల వారు సైతం జగనన్న పాలనపై సంతృప్తి వ్యక్తం చేశారు. తాము ఇక్కడ స్థిర పడడంతో తమ కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరుతోందని వారు మంత్రికి ఆనందంగా వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, సొసైటీ మాజీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు, సొసైటీ అధ్యక్షుడు ముదునూరి సూర్యనారాయణ రాజు, స్థానిక నాయకులు బొల్లిన సతీష్, కొమ్మన మణిబాబు, సర్పంచ్ తానేటి కుమారి, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, ముదునూరి అబ్బాయి రాజు, డేగపాటి సురేష్, వరిగేటి సుధాకర్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు అర్హతే ప్రామాణికం

నిడదవోలు రూరల్: అర్హతే ప్రామాణికంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని కాటకోటేశ్వరంలో బుధవారం రాత్రి ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు ఇంటింటికీ వెళ్లారు. గత నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం ఈ గ్రామస్తులకు అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మరోసారి వంచించేందుకు టీడీపీ, జనసేన కలిసి మోసపూరిత హామీలతో ప్రజల వద్దకు వస్తున్నాయన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో జరిగిన లబ్ధిని గుర్తు చేసుకుని వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మద్దతు పలకాలని కోరారు. గ్రామంలో డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి రామచంద్రరావు, కోనూరి అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు పెనుగుర్తి రాము, సొసైటీ అధ్యక్షుడు గుంటుపల్లి కృష్ణమూర్తి, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు ఓలేటి శివరామకృష్ణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్షయ రోగులకు మెరుగైన సేవలందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ వసుంధర

నిడదవోలు: క్షయ (టీబీ) రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ నివారణాధికారి డాక్టర్ ఎస్.వసుంధర ఆదేశించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలోని క్షయ, హెచ్ఐవీ నివారణ కేంద్రాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్షయ వ్యాధి నిర్ధారణకు రోగులకు చేసే కళ్లె , ల్యాబ్ పరీక్షలు, టీబీ చికిత్సకు సంబంధించిన రికార్డులను ఆమె పరిశీలించారు. అలాగే హెచ్ఐవీకి చెందిన రికార్డులను కూడా తనిఖీ చేశారు. వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న మందుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్షయ వ్యాధిగ్రస్తుల ఇళ్లకు వెళ్లి క్షేత్రస్థాయి సిబ్బంది అందిస్తున్న చికిత్సా విధానం, మందుల వివరాలను డాక్టర్ వసుంధర తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ఏవీఆర్ఎస్ తాతారావు, ఎంపీహెచ్ఎస్ వీర్రాజు, ఎస్ టీఎల్ఎస్ భీమరాజు, రత్నకుమారి, ఎల్‌టీ రాజ్ కుమార్, ఐసీటీసీ కౌన్సిలర్ జి. ప్రమోదకుమారి పాల్గొన్నారు.

కొవ్వూరులో ఐసీటీసీ, టీబీ విభాగాల పరిశీలన

కొవ్వూరు: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి ఆవరణలోని ఐసీటీసీ, టీబీ విభాగాలను జిల్లా ఎయిడ్స్, టీబీ, లెప్రసీ అధికారి (డీఏటీఎల్‌వో) ఎస్.వసుంధర బుధవారం తనిఖీ చేశారు. ఇక్కడి రికార్డులను పరిశీలించి సిబ్బంది పలు సూచనలు చేశారు. అంతకు ముందు తాను చాగల్లు ఐసీటీసీ, టీబీ విభాగాలను పరిశీలించినట్టు ఆమె తెలిపారు. గత నెల రోజుల్లో హెచ్ఐవీ నిర్ధారణకు 500 శాంపిల్స్ సేకరించగా రెండు పాజిటివ్ వచ్చాయన్నారు. టీబీ నిర్ధారణకు 306 శాంపిల్స్ సేకరించగా 14 పాజిటివ్‌గా తేలాయన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ సాయికిరణ్, ఐసీటీసీ కౌన్సిలర్ సానబోయిన సత్యనారాయణ, ఆర్ఎల్ డీసీపీ (టీబీ విభాగం) ల్యాబ్ టెక్నీషియన్ పి.సుప్రియ, ఐసీటీసీ ల్యాబ్ టెక్నీషియన్ వి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పొలంబడులతో రైతులకు అవగాహన

- జేడీఏ మాధవరావు
- ముగిసిన అన్నదాతల శిక్షణ



అనంతపల్లి పొలంబడి ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న జేడీఏ మాధవరావు

నల్లజర్ల: వివిధ పంటల సాగుపై క్షేత్ర స్థాయిలో నిర్వహించే పొలంబడుల వల్ల రైతుల్లో ఎంతో అవగాహన కలుగుతోందని జిల్లా వ్యవసాయాధికారి ఎస్. మాధవరావు అన్నారు. మండలంలోని అనంతపల్లిలో బుధవారం 14వ వారం పొలంబడి (ముగింపు) కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పొలంబడి ద్వారా ఎరువుల సమతుల్యం, పురుగు మందుల వాడకంలో నియంత్రణ, నీటి యాజమాన్యం వంటి అంశాలపై రైతులు అవగాహన ఏర్పరుచుకున్నారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా యువ రైతులను శాస్త్రవేత్తలుగా తయారు చేయడంలో స్థానిక ఏవో కమల్‌రాజ్ సఫలీకృతం అయ్యారంటూ కొనియాడారు. అనంతరం పంటకోత ప్రయోగం నిర్వహించారు. సరాసరిన ఎకరానికి 34 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చింది. తాము పండించిన పంటలను రైతులు మార్కెటింగ్ ఏవిధంగా చేసుకోవాలనే విషయాలను వివరించారు. కార్యక్రమంలో కొవ్వూరు ఏడీఏ చంద్రశేఖరరావు, డీఆర్సీ ఏడీఏ జ్యోతిర్మయి, ఏఓ వెంకన్నబాబు, సొసైటీ డైరెక్టర్ వలిరెడ్డి అర్జున్, రైతు భరోసాకేంద్ర చైర్మన్ ప్రత్తి శ్రీనుబాబు, ఏఈఓ పుష్పలత, సహాయకులు పాల్గొన్నారు.

సబ్ డివిజన్ చేసి భూములు అప్పగించండి

తహసీల్దార్‌కు ఎస్సీ మహిళా రైతుల వినతి



సబ్ డివిజన్ చేయాలని కోరుతున్న పోచవరం ఎస్సీ మహిళా రైతులు

తాళ్లపూడి: తమ భూములకు హక్కు పట్టాలు ఉన్నప్పటికీ రెవెన్యూ అధికారులు సబ్ డివిజన్ చేయక పోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మండలంలోని పోచవరానికి చెందిన పలువురు ఎస్సీ మహిళా రైతులు వాపోయారు. వారు బుధవారం తాళ్లపూడిలో తహసీల్దార్ టి.రాధికను కలిసి సబ్ డివిజన్ చేసి, భూములను తమకు అప్పగించాలంటూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహిళా రైతులు మార్కు అనూష, మెంటే పోషాలమ్మ, దాకే వెంకాయమ్మ, దానం అన్నవరం తదితరులు మాట్లాడుతూ గ్రామంలోని సుమారు 60 మందికి ప్రభుత్వం గతంలోనే సాగు భూమికి హక్కు పట్టాలు ఇచ్చిందన్నారు. వారిలో 28 మందికి చెందిన భూములను సబ్ డివిజన్ చేయక పోవడం వల్ల సమస్యలు వస్తున్నాయని వివరించారు. పంట వేసుకున్నా ఫలితం ఉండడం లేదన్నారు. సమీపంలోని వారు తమ భూములను ఆక్రమించుకుంటున్నారన్నారు. రీ సర్వే చేయించి, సమస్యను పరిష్కారిస్తామని వారికి తహసీల్దార్ రాధిక హామీ ఇచ్చారు.

10 నుంచి ధర్మప్రచార మాసోత్సవాలు

- ద్వారకాతిరుమలలో ఉత్సవాలను ప్రారంభించనున్న మంత్రి కొట్టు
- ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు అందించిన ఆలయ ఈఓ త్రినాథరావు

ద్వారకాతిరుమల: రాష్ట్ర ప్రజల సర్వతోముఖాభివృద్ధి, సనాతన ధర్మ పరిరక్షణ, ఆలయ సంస్కృతి సంప్రదాయాల వ్యాప్తిని కాంక్షిస్తూ ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఈనెల 10 నుంచి వచ్చే నెల 9 వరకూ ధర్మప్రచార మాసోత్సవాలు నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, దేవదాయ ధర్మాదాయ శాఖ, ధర్మప్రచార పరిషత్, శ్రీవారి దేవస్థానాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. అందులో భాగంగా ఉత్సవాల ఆహ్వాన పత్రికలను దేవదాయశాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్. కరికాల్ వలవన్, ఆ శాఖ కమిషనర్ రాము సత్యనారాయణ తదితరులకు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు అందజేశారు. అనంతరం ఉత్సవ విశేషాలను ఆయన వెల్లడించారు.

ఉత్సవాలు జరిగేదిలా..

ఈనెల 10న ఉదయం 9.30 గంటలకు దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు శ్రీవారు, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. అనంతరం ఆలయ అర్చకులు, పండితులు, ఆగమ విద్యార్థుల వేద మంత్రోచ్ఛరణలు, కళాకారుల ప్రదర్శనలు, కోలాట భజనలు, మంగళ వాయిద్యాల నడుమ ధర్మప్రచార రథాన్ని మంత్రి ప్రారంభిస్తారు. ఆ తరువాత 11.30 గంటలకు ధర్మ ప్రచార పరిషత్ – ధార్మిక సభను ఘనంగా ప్రారంభిస్తారు.

ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు

- ఆర్డీవో మల్లిబాబు
- కొవ్వూరులో ఓటు నమోదు అవగాహన ర్యాలీ



కొవ్వూరులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం.చిత్రంలో ఆర్డీవో మల్లిబాబు, డీఎస్పీ వర్మ

కొవ్వూరు: ఓటు లేని వయోజనులు ఎవరైనా ఉంటే వెంటనే ఫారం -6 ద్వారా తమ ఓటును నమోదు చేయించుకోవాలని ఆర్డీవో ఎస్.మల్లిబాబు సూచించారు. ఓటు హక్కు ప్రాధాన్యం, నమోదు, ఓటరు జాబితాల్లో మార్పులు, చేర్పులు, సవరణలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు బుధవారం సాయంత్రం కొవ్వూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్ల వయసు పూర్తయ్యే వారు కూడా ఓటు నమోదు చేయించుకోవచ్చన్నారు. చిరునామా, నియోజకవర్గం మారినా, బూత్ మారినా ఓటరు మరణించినా మార్పులు, చేర్పులు చేయించుకునేందుకు ఫారం-7, ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రయుధం అని ప్రతి ఒక్కరూ, దాని ప్రాముఖ్యతను తెలుసుకుని ఓటు నమోదు చేయించుకోవాలని డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ సూచించారు. విజయవిహార్ సెంటర్ వద్ద మొదలైన ర్యాలీ జీఎస్ రావు కాపు కల్యాణ మండపం వరకూ ర్యాలీ సాగింది. అనంతరం ఓటు నమోదు ప్రక్రియపై మునిసిపల్ కార్యాలయంలో ఆర్డీవో సమీక్ష జరిపారు. కమిషనర్ బి.శ్రీకాంత్, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, సచివాలయం, రెవెన్యూ సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు వెన్నెల

చాగల్లు: స్కూల్ గేమ్స్ అండర్-14 రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు మండలంలోని కలవలపల్లి జెడ్పీ హైస్కూల్ ఎనిమిదో తరగతి విద్యార్థిని తాడేపల్లి వెన్నెల ఎంపికైంది. ఇటీవల పెద్ద తాడేపల్లిలో నిర్వహించిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయి వాలీబాల్ ఎంపిక పోటీల్లో ఆమె ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికైందని హెచ్ఎం జొన్నకూటి వెంకట శ్రీనివాస్ బుధవారం తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో ఈ నెల 9వ తేదీ నుంచి నిర్వహించే స్కూల్‌గేమ్స్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టు తరఫున వెన్నెల పాల్గొంటుందని తెలిపారు.

నేడు హోం మంత్రి పర్యటన

కొవ్వూరు: రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత గురువారం ఉదయం ఎనిమిది గంటల నుంచి దొమ్మేరులో నిర్వహించే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారు. ఉదయం11 గంటలకు తాళ్లపూడి మండలం బల్లిపాడులోని కాకర్ల రామయ్య కల్యాణ మండపంలో నిర్వహించే మెగా జాబ్ మేళాకు హాజరవుతారు. మధ్యాహ్నం రెండున్నర గంటలకు చాగల్లు మండలం ఎస్. ముప్పవరంలో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తారు. 3 గంటలకు దొమ్మేరులో గ్రామ సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభిస్తారు. అనంతరం అదే గ్రామంలో నిర్వహించే ఏపీ జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 4.30 గంటలకు అదే గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారు.

విద్యాసంస్థల బంద్ ప్రశాంతం

ఉండ్రాజవరం: భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో మండలంలో బుధవారం నిర్వహించిన ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల బంద్ ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి ఎస్.కార్తీక్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చర్యలను విరమించుకోవాలని, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టాలని కోరుతూ ఈ బంద్ నిర్వహించామన్నారు. ఈ డిమాండ్లతో కార్మికులు, ప్రజా సంఘాలు చేస్తున్న ఆందోళన వెయ్యి రోజులు పూర్తవుతున్న సందర్భంగా విద్యాసంస్థల బంద్ నిర్వహించినట్టు తెలిపారు.

ప్రార్థనా మందిరం ప్రారంభం

గోపాలపురం: నమ్మకంతో దేవుడ్ని ప్రార్థిస్తే అందరికీ మేలు జరుగుతుందని ఏపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ అన్నారు. మండలంలోని గుడ్డిగూడెం గ్రామంలో కొత్తగా నిర్మించిన గెత్సెమన్ ప్రేయర్ ప్రార్థన మందిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు.

నేటి నుంచి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం

నిడదవోలు రూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గురువారం నుంచి ప్రతి సచివాలయ పరిధిలోనూ వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు బుధవారం తెలిపారు. 9న కోరుమామిడి-2, 10న కోరుమామిడి-1, 14న కాటకోటేశ్వరం, 15న కంసాలిపాలెం, 16న గోపవరం, 17న డి. ముప్పవరం, 20న అట్లపాటు, 21న సమిశ్రగూడెం-1, 22న సమిశ్రగూడెం -2, 23న శెట్టిపేటల్లో తొలివిడతగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. గురువారం నాటి కోరుమామిడి కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు ముఖ్య అతిథిగా హాజరై వైఎస్సార్ సీపీ స్థూపాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు.

దేవరపల్లి మండలంలో..

దేవరపల్లి: ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం మండలంలో గురువారం నుంచి ప్రారంభం అవుతుందని ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు తెలిపారు. 9న దుద్దుకూరు -1 సచివాలయం వద్ద, 10న దేవరపల్లి -3 సచివాలయం వద్ద, 14న దేవరపల్లి -2 సచివాలయం, 15న దేవరపల్లి -1 సచివాలయం వద్ద కార్యక్రమం జరుగుతుందన్నారు. 16న చిన్నాయగూడెం 2, 17న చిన్నాయగూడెం- 1 సచివాలయం వద్ద కార్యక్రమం జరుగుతుంది. 20న బందపురం సచివాలయం వద్ద, 21న కురుకూరు సచివాలయం వద్ద, 22న సంగాయగూడెం సచివాలయం వద్ద, 23న త్యాజంపూడి సచివాలయం వద్ద కార్యక్రమం జరుగుతుందని ఆయన వివరించారు.